
కల్లూరురోడ్డు చెక్‌పోస్టు వద్ద కారును తనిఖీ చేస్తున్న సిబ్బంది


తల్లాడలో జాతీయ రహదారిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు


వైరారోడ్డు చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

చెక్ పడాల్సిందే..!

- అప్రమత్తమైన పోలీసులు
- మండలంలో రెండు చెక్‌పోస్టుల ఏర్పాటు
- వాహనాలను తనిఖీ చేస్తున్న సిబ్బంది
- డబ్బు, మద్యం తరలించకుండా అడ్డుకట్ట

తల్లాడ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్ పోస్టులు డబ్బు, మద్యం తరలింపునకు అడ్డుకట్ట వేస్తున్నాయి. తల్లాడలో రెండు చోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేయగా.. ఒకటి కల్లూరు రోడ్డులో ఎస్‌ఎస్‌టీ ఆధ్వర్యంలో, మరొకటి వైరా రోడ్డులో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు.

షిఫ్టుల వారీగా విధులు..

ఈ చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది మూడు షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తున్నారు. వారిలో ఎగ్జిక్యూటీవ్ మేజిస్ట్రేట్, కానిస్టేబుల్, వీడియోగ్రాఫర్ ఉంటారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో ఎస్సై పర్యవేక్షణలో కానిస్టేబుళ్లు ఉదయం, సాయంత్రం, రాత్రి వరకు షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తున్నారు.

అన్ని రకాల వాహనాల తనిఖీ..

అక్టోబర్ 19 నుంచి చెక్ పోస్టుల వద్ద అన్ని రకాల వాహనాలను తనిఖీ చేస్తున్నారు. జాతీయ రహదారిలో ఏర్పాటు చేసిన ఈ చెక్‌పోస్టుల మీదుగా నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. కార్లు, బస్సులు, లారీలు, వ్యాన్లు, ద్విచక్ర వాహనాలతో పాటు అన్ని రకాల వాహనాలను తనిఖీ చేస్తున్నారు.

రూ.50 వేలకు మించొద్దు..

ఎన్నికల నియమావళి ప్రకారం 50 వేల రూపాయల లోపు నగదు మాత్రమే ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్లవచ్చు. అంతకు మించి నగదు తరలిస్తే.. ద్విచక్ర వాహనం దగ్గర నుంచి ఎలాంటి వాహనాన్నైనా తనిఖీ చేసి స్వాధీనం చేసుకొని ఉన్నతాధికారులకు అప్పగించడం జరుగుతుంది. ఆధారాలు చూపించిన తర్వాతనే డబ్బులు తిరిగి ఇస్తారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేస్తున్నాం..



జాతీయ రహదారిలో వెళ్లే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేస్తున్నాం. మూడు షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తున్నాం. ప్రతీ రోజు వేలాది వాహనాలు జాతీయ రహదారిలో వెళ్తుండగా అన్నింటినీ తనిఖీ చేసిన తర్వాతనే పంపిస్తున్నాం. వాహన తనిఖీని వీడియో కెమెరాలో చిత్రీకరిస్తున్నాం.

– వి.సీతారామ్ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, తల్లాడ చెక్ పోస్టు

లేకపోతే వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయవచ్చు.

తప్పని ఇబ్బందులు..

జాతీయ రహదారిలో అంబులెన్స్‌లే కాకుండా కార్లు, ప్రైవేట్ వాహనాల్లో పేషంట్లను తీసుకెళ్తుంటారు. వీరిలో కొన్ని ఎమర్జెన్సీ కేసులు ఉంటాయి. అయినా కారు ఆపి తనిఖీ చేసిన తర్వాతనే పంపిస్తున్నారు. ఈ క్రమంలో సాధారణ ప్రయాణికులు సైతం, వివిధ వాహనాల్లో వెళ్లే వారికి చెక్ పోస్టుల వద్ద తనిఖీ కాస్త ఇబ్బందిగా ఉన్నా.. ఈ నెల 30వ తేదీ వరకు భరించాల్సిందే.

క్లుప్తంగా

ఖర్చుల వివరాలు సమర్పించాలి

వైరా: పలు పార్టీలకు చెందిన వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చుల వివరాలను ఆర్‌ఓ కార్యాలయంలో సమర్పించాలని ఏఆర్‌ఓ కేవీ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల వ్యయానికి సంబంధించిన లెక్కలు పరిశీలించడానికి వ్యయ పరిశీలకుడు ఈ నెల 19, 24, 29 తేదీల్లో వైరా తహసీల్‌లో ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంటారన్నారు. కావున అభ్యర్థులు తమ బ్యాంకు పాస్‌పుస్తకం, ఖర్చుల బిల్లులు తదితర వివరాలతో స్వయంగా కానీ, ఏజెంట్ ద్వారా కానీ వ్యయ పరిశీలకుడికి చూపించి సంతకాలు తీసుకోవాలన్నారు.

పోలీసుల కవాతు


కవాతు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు

ఏన్కూరు: ఎన్నికల విధుల్లో భాగంగా మండల పరిధిలోని భద్రుతండ, భగవాన్‌నాయక్ తండ, బురధరాఘవాపురం గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్, పోలీసులు శుక్రవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై బాదావత్ రవి మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

చరమ గీతం పాడండి

తల్లాడ: అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణాలో దొరల పాలనకు చరమ గీతం పాడాలని సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మట్టా రాగమయి అన్నారు. తల్లాడ మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనీల్, సుధాకర్, రఘుపతిరెడ్డి, వెంకటనారాయణ, లచ్చిరెడ్డి, వెంకటేశ్వరరావు, రామారావు, నరసింహారావు, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రచారం..

కారేపల్లి: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని వైరా నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మాలోత్ రాందాస్ నాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకురాలు పోట్ల మాధవి తెలిపారు. శుక్రవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రప్రకాశ్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పలుచోట్ల ప్రజలు మంగళహారతులు.. సాంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు మంజుల, నాగేశ్వరరావు, శ్రీనునాయక్, మజీద్ పాషా, వీరప్రతాప్ టోనీ, లక్ష్మీనారాయణ, నాగులు, నాగేశ్వరరావు, రామ్మూర్తి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గెలిపించండి అభివృద్ధి చేస్తా..

బోనకల్: గెలిపించండి.. మధిర నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్‌ఎస్ మధిర అభ్యర్థి, జెడ్పీచైర్మన్ లింగాల కమల్ రాజ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి మాట్లాడారు. ఈ సందర్భంగా సీతానగరం గ్రామంలో 15 కుటుంబాలు కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరాయి. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, మల్లికార్జున్, కొండ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు


స్ట్రాంగ్ రూమ్ వద్ద పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు కానారామ్


వల్లాపురంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీసీఈఓ అప్పారావు, అధికారులు

మధిర: మండలంలోని ఖాజీపురం ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమును శుక్రవారం మధిర అసెంబ్లీ ఎన్నికల పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి కానారామ్ సందర్శించారు. అనంతరం మండలంలోని పలు సమస్యాత్మక గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు, బూత్ స్థాయి సిబ్బందికి ఆయా ప్రాంతాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి గణేష్ ఉన్నారు.

ముదిగొండ: మండలంలోని ముదిగొండ, కట్టకూరు, సీతారాంపురం, దనియాలగూడెం, సువర్ణాపురం, వనంవారికిష్టాపురం, వల్లాపురం, అమ్మపేట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం జెడ్పీసీఈఓ వీవీ అప్పారావు, మండల అధికారులతో కలిసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలోని వసతులు, గోడ వ్రాతలు, ఓటరు స్లిప్పుల పంపిణీని పరిశీలించారు. ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్, ఎంపీఓ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

చింతకాని/కల్లూరురూరల్: ప్రజా స్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని చింతకాని, కల్లూరురూరల్ తహసీల్దార్లు రమేష్, సాంబశివుడు తెలిపారు. చింతకాని మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కోపూరి పూర్ణయ్య అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం నిర్వహించగా.. తహసీల్దార్ మాట్లాడారు. బీఎల్‌ఓలు, అధికారులు ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలో అత్యధిక పోలింగ్ శాతం నమోదయ్యే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పోలింగ్ స్లిప్పులను ప్రతీ ఓటరుకు అందించాలన్నారు. అదే విధంగా కల్లూరురూరల్ మండలంలో చెన్నూరుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దంతాల సుధాకర్ ఓటర్ అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ సాంబశివుడు ప్రారంభించి మాట్లాడారు. సుధాకర్ కరపత్రాలు, మైకు, ప్లేకార్డుల జెండాలతో తిరుగుతూ ఓటుహక్కుపై అవగాహన కల్పించడం


కల్లూరురూరల్: ఓటరు అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ సాంబశివుడు

అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాలల్లో ఎంపీడీఓ శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు, గ్రామసర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ పరిశీలన..

ఏన్కూరు: ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల అధికారి సత్యప్రసాద్ కోరారు. మండలంలో ఓటరుస్లిప్పు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టును తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణ, ఆర్‌ఐ నవీన్ పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమ అనుమతి రద్దుచేయాలి

మధిరరూరల్: ప్రజా జీవితాలను, భూములను మింగేసే ఇథనాల్ పరిశ్రమ అనుమతి రద్దు చేయాలని సీపీఎం నాయకుడు మద్దాల ప్రభాకర్ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని శుక్రవారం సాయిపురంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొండల గోపవరం గ్రామపంచాయతీ శివారు సాయిపురం సమీపంలో ఈ పరిశ్రమ ఏర్పాటుకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు లింగాల కమల్‌రాజ్, మల్లు భట్టి విక్రమార్క తమ వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. తొర్లపాడు రెవెన్యూ పరిధిలోని 104,105 సర్వే నంబర్లలో హిందుస్థాన్ పెట్రోలియం అనుబంధ సంస్థ కేబీడీ ఇండస్ట్రీస్ అనే సంస్థ ఇథనాల్ అనే రసాయనిక పదార్థాన్ని ఉత్పత్తి చేసే కర్మాగారాన్ని నెలకొల్పే ప్రయత్నం చేస్తుందన్నారు. నిబంధనలకు


పంపిణీ చేసిన కరపత్రాలతో మద్దాల ప్రభాకర్

విరుద్ధంగా ఏర్పాటు చేసే ఈ ఫ్యాక్టరీని నెలకొల్పితే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ సంస్థ హమాలీ సంఘ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్, నాయకులు దోర్నాల విజయ్, విల్సన్, తమ్మా వెంకటరెడ్డి, వీరారెడ్డి, ఏసుపాదం, చంద్రారెడ్డి, పింగళి రామిరెడ్డి పాల్గొన్నారు.

'మిస్ట్' విద్యార్థులకు సర్టిఫికెట్లు..

సత్తుపల్లిరూరల్: స్థానిక మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న మూడో సంవత్సర విద్యార్థులకు ఐఈఈఈ సంస్థ ద్వారా అప్ స్కిల్ ప్రోగ్రాం ఇన్ ఐఓటీ టెక్నాలజీస్ అనే కోర్సుపై శిక్షణ అందించారు. ఈనేపథ్యాన శుక్రవారం శిక్షణ పూర్తికాగ విద్యార్థులకు ఐఈఈఈ సంస్థ సర్టిఫికెట్లను అందించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యతో పాటు భవిష్యత్‌లో ఉద్యోగ, ఉపాధి పొందేందుకు ఇటువంటి అదనపు స్కిల్స్, నాలెడ్జ్ కోర్సులు ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం శిక్షణ పొందిన 20 మంది విద్యార్థులను అభినందించారు. ఈ


సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

కార్యక్రమంలో జాకీర్ హుస్సేన్, వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి, జి.ఉదయ్‌కిరణ్, భార్గవ్, సుజాత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం


కల్లూరురూరల్: సండ్రతో పాటు ఎంపీ నామాకు హారతిపడుతున్న మహిళలు


సత్తుపల్లి: మాట్లాడుతున్న ఎంపీ బండి పార్థసారథిరెడ్డి

కల్లూరురూరల్: బీఆర్‌ఎస్ పార్టీని గెలిపిస్తేనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని సత్తుపల్లి అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని ఎర్రబోయిన పల్లి, చంద్రుపట్ల, రఘునాథబంజరు, ముగ్గు వెంకటాపురం, పేరువంచ, కొర్లగూడెం, నారాయణపురం, పెద్దకోరుకొండి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లా సశ్యశ్యామలం చేస్తామన్నారు. అనంతరం ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీమంత్రి సంభాని చంద్రశేఖర్ మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి కేవలం సండ్రతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీ బండి పార్థసారధి, ఎమ్మెల్సీ తాతామధు, సర్పంచ్ సింగిసాల పద్మ, ప్రసాద్, గొల్లమందల ప్రసాద్, బైరెడ్డి నర్సింహారెడ్డి, అనూష్‌రెడ్డి, వెంకటరెడ్డి, ఎంపీపీ రఘు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి అభివృద్ధికి విజన్ ఉంది..

సత్తుపల్లి: సత్తుపల్లి అభివృద్ధికి విజన్‌తో ముందుకెళ్తాం.. జిల్లా సాధన, ఐటీ హబ్, దళితబంధు, గుడిసెలు లేని తెలంగాణగా మార్చడం తమ విధానమని ఎంపీ బండి పార్థసారధిరెడ్డి అన్నారు. సత్తుపల్లి పట్టణంలో శుక్రవారం పలు వార్డుల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అందరికీ అందుబాటులో ఉండే మనిషి అని.. అభివృద్ధి, సంక్షేమం అందించటంలో ముందుంటారన్నారు. వెంగళరావునగర్‌లో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సమక్షంలో ఐ.కృష్ణ, ఎండీ ఫజల్‌బాబా, మహేంద్ర భాషాలతో పాటు పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కోటూరి మానవతారాయ్, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, కృష్ణయ్య, సాల్మన్‌రాజు, గఫార్‌ఖాన్, అనీల్‌కుమార్, రాధిక, బాబి, రఫీ పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామా భట్టి


మధిర: ఇస్త్రీ చేస్తున్న సూర్య విక్రమాదిత్య


ముదిగొండ: కమలాపురం ఎన్నికల ప్రచారంలో మల్లు నందిని, సూర్యవిక్రమాదిత్య

మధిర/ఎర్రుపాలెం/ముదిగొండ: మధిర నియోజకవర్గ అభివృద్ధికి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చిరునామా అని భట్టి తనయుడు మల్లు సూర్య విక్రమాదిత్య, మల్లు నందిని తెలిపారు. తన తండ్రి భట్టిని గెలిపించాలని కోరుతూ శుక్రవారం మధిరలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించగా.. ఎర్రుపాలెం మండలంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ కరపత్రాలను అందించారు. అదే విధంగా ముదిగొండ మండలంలోని పలు గ్రామాల్లో విక్రమాదిత్యతో పాటుగా మల్లు నందిని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రమాదిత్య ఇస్త్రీ చేసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హయాంలో వివిధ హోదాల్లో పనిచేసిన భట్టి మధిర నియోజకవర్గం అభివృద్ధికి సుమారు రూ.1,800 కోట్ల నిధులు మంజూరు చేయించి అభివృద్ధికి బాటలు వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ధనికుమార్, వెంకటేశ్వరరావు, లక్ష్మి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, కోటేశ్వరరావు, రంగారావు, టీవీ రెడ్డి, నవీన్ రెడ్డి, రామరాజు, రాజేందర్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ నాయకులు భాస్కర్ రావు, శ్రీనివాసరావు, ఇస్మాయిల్, లక్ష్మణరావు, వెంకట్రావు, వెంకటనారాయణ, రాజేష్, బాజీ, పెద్దమహాబు, మదర్సా, వీరవసంతరావు, శంకర్, కష్ణ, తురాబ్ ఆలీ, ఖాజా బాబు, ఖాదర్‌బాషా, బాజీ, సుభాని, సర్పంచ్ వరలక్ష్మి, ఎంపీటీసీ ఆదినారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ భద్రారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, బాబురాంరెడ్డి, పుల్లారెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి, కలకొడిమ, తల్లాడ పట్టణ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తల్లాడ, కుర్నవల్లి సెక్షన్ ఏఈలు రాజేష్, సుందర్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుర్నవల్లి, కలకొడిమ, బస్వాపురం, తల్లాడ, నారాయణపురం, మల్లారం గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

ఎర్రుపాలెం: మధిర పట్టణంలో ఇటీవల నిర్వహించిన జాతీయ బాలల దినోత్సవంలో మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గ్రూప్ డ్యాన్స్, సోలో జానపదం, భరతనాట్యం విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి ప్రోత్సాహక బహుమతులు గెలుచుకున్నారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ప్రతిభ చూపిన విద్యార్థులను జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం రంగారెడ్డి, స్థానిక పాఠశాల హెచ్‌ఎం జంగా గురునాథ రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ వేమిరెడ్డి పాపిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

సామాజిక న్యాయం మాతోనే సాధ్యం

వేంసూరు:/పెనుబల్లి: తెలంగాణలో సామాజిక న్యాయం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ అభ్యర్థి నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. శుక్రవారం వేంసూరు, పెనుబల్లి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు, సత్తుపల్లి నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్ల వీరంరాజు, మట్టా ప్రసాద్, దొడ్డపునేని కృష్ణయ్య, బీజేపీ మండల అధ్యక్షులు నరసింహారావు, జిల్లా అధికార ప్రతినిధి మదుసూదన్‌రావు, ప్రధాన కార్యదర్శి రాము, ఎస్టీ మోర్చా అధ్యక్షులు రమేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు మహేష్ పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలోని నారాయణపురం, అంబేడ్కర్ నగర్, తల్లాడ గ్రామాల్లో శుక్రవారం బీజేపీ సత్తుపల్లి అభ్యర్థి నంబూరి రామలింగేశ్వరరావు గెలుపును కాంక్షిస్తూ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటరామారావు మాట్లాడుతూ.. కమలం గుర్తుకు ఓటు వేసి జనసేన బలపరిచిన నంబూరిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లంకి సుధాకర్, గాదె కృష్ణారావు, చౌడా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నాగుల చవితి వేడుకలు

మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు పలుచోట్ల పుట్టలో పాలు పోసి నాగేంద్రుడిని పూజించారు. పుట్ట వద్ద చిన్న పిల్లలకు చెవి పోగులు కుట్టించారు. మహిళలు ఉపవాస దీక్ష చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్


మధిరరూరల్: పూజలు నిర్వహిస్తున్న భక్తులు


తల్లాడ: అంజనాపురం వద్ద..


ఏన్కూరు: పుట్టలో పాలుపోస్తున్న భక్తులు

సాగర్ జలాల విడుదలకు అధికారుల హామీ


మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా: వైరా రిజర్వాయర్‌ను సాగర్ జలాలతో నింపి ఆయకట్టు పరిధిలో పంటల సాగుకు నీరందిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఈ నెల 18న చేపట్టాల్సిన రైతుదీక్ష, ఉద్యమానికి తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఆయకట్టు పరిరక్షణ కమిటీ సభ్యుడు బొంతు రాంబాబు అన్నారు. శుక్రవారం వైరా సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 16న వైరా ఐబీ డీఈ కార్యాలయం ఎదుట రైతులు ఎండిపోతున్న వరి దుబ్బలతో నిర్వహించిన ప్రదర్శన, దశల వారీగా ఉద్యమానికి పిలుపునివ్వడంతో అధికారులు సాగర్ జలాలు విడుదలకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు సుధాకర్, రామారావు, చలపతిరావు, సమత, కృష్ణారావు, శ్రీనివాసరావు, కృష్ణ, రవి, మధు పాల్గొన్నారు.

పోరాడే పార్టీ సీపీఎం

కొణిజర్ల: పీడిత అణగారిన వర్గాల పక్షాన పోరాడే ఏకైక పార్టీ సీపీఎం అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొణిజర్ల సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ మండల కమిటీ సమావేశం కొప్పుల కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైరా నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి భూక్యా వీరభద్రాన్ని అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఖమ్మం జిల్లాలో 5 స్థానాల్లో సీపీఎం పోటీలో ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బొంతు రాంబాబు, తాళ్లపల్లి కృష్ణ, కుటుంబరావు, నారాయణ, ప్రసాద్, ఏవీఆర్, వీరభద్రం, కృష్ణార్జునరావు, విజయ, అజయ్ పాల్గొన్నారు.

కారేపల్లి: పేదల సమస్యలపై పోరాడే వైరా సీపీఎం అభ్యర్థి భూక్యా వీరభద్రం గెలుపును కాంక్షిస్తూ.. ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మూడ్ శోభన్ ఆధ్వర్యంలో నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. ఉసిరికాయలపల్లి సర్పంచ్ భస్సీలాల్, మండల కమిటీ సభ్యుడు మల్లయ్య, నాయకులు చందర్, ఉమావతి, ఏకాంబరం, కృష్ణ, బందెలి పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కులేదు..

ఏన్కూరు: వైరా నియోజకవర్గంలో అవకాశవాదులకు ఓటు అడిగే హక్కులేదని సీపీఎం జాతీయ నాయకురాలు ఎస్.పుణ్యవతి అన్నారు. మండలంలోని జన్నారం, ఏన్కూరు గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ అభ్యర్థి భూక్య వీరభద్రం, బొంతు రాంబాబు, బానోత్ బాలాజీ, నాగేశ్వరావు, వెంకటేశ్వర్లు, రాములు, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలం..

ముదిగొండ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను బుట్టదాఖలు చేసిందని మధిర నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి పాలడుగు భాస్కర్ ఆరోపించారు. ముదిగొండ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, జిల్లా నాయకులు వరప్రసాద్, బండి పద్మ, మందరపు వెంకన్న, రాయల శ్రీనివాసరావు, మంకెన దామోదర్, వల్లబి రవికిరణ్, పోలూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.